కుక్కల స్వైర విహారం

- జనాలను వెంబడిస్తున్న కుక్కలు
- బెంబేలెత్తిపోతున్న జనం
- పట్టించుకోని అధికారులు


రాత్రివేళలో పూలంగళ్ల వద్ద సంచరిస్తున్న కుక్కలు


ఆటోనగర్ ప్రాంతంలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా, ఏ వీధి చూసినా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధులలో పదుల సంఖ్యలో కుక్కలు గుమికూడి దర్శనమిస్తున్నాయి. వాటిని దాటి ముందుకు వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వాహనాలలో వెళ్లేటప్పుడు కుక్కలు వెంబడిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కుక్క కాటుకు ఎంతోమంది బలవుతున్నారు. అధికారులకు కుక్కల బెడద గురించి తెలిసినా కానీ ఏమాత్రం పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు వెళ్లేటప్పుడు కుక్కలు మీదకు అరుచుకుంటూ రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అర్థంకానీ పరిస్థితిలో ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని తిరుగుతున్నారు. పులివెందులలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా చేరి కనిపిస్తున్నాయి. వాటిని అదలించేందుకు వీలుకానీ పరిస్థితిలో కుక్కలు ఉన్నాయి. వీధులలో ఒంటరిగా మహిళలు, పిల్లలు వెళ్లాలంటే జంకుతున్నారు. మీద పడి ఎక్కడ కరుస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. పట్టణంలో 3 వేలకుపైగా కుక్కలు ఉన్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పులివెందులలో కుక్కల బెడద లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

కుక్కలను చూస్తే భయమేస్తోంది..



మా వీధిలో కుక్కలు గుంపులు గుంపలుగా ఉంటున్నాయి. వాటిని అదలిస్తే మీదకు వస్తున్నాయి. నేను నడవాలంటేనే ఇబ్బందిగా ఉంటుంది. కుక్కలు మీదకు వస్తే ఏమి చేయాలో అర్థంకానీ పరిస్థితి. కుక్కలు కరవడానికి వస్తే పక్కవాళ్లు అదలించి పంపించారు. కుక్కల బెడద లేకుండా చూడాలి.

– రామలక్షుమ్మ, గాడిచర్ల వీధి, పులివెందుల

కుక్కల బెడద లేకుండా చూడాలి



పట్టణంలో ఎక్కడికి వెళ్లాలన్నా కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వాటిని దాటుకుని ముందుకు వెళ్లాలంటే ఎక్కడ కరుస్తాయోనని భయమేస్తోంది. మా వీధిలో కొంత మందిని కుక్కలు కరిచిన సంఘటనలు ఉన్నాయి. రాత్రివేళ కుక్కలు గుంపులు గుంపులుగా చేరి వాహనంలో వెళుతుంటే వెంటపడుతున్నాయి. కుక్కల బెడదపై అధికారులు స్పందించాలి.

– సురేంద్ర, నగరిగుట్ట, పులివెందుల

ఘనంగా వైఎస్ పురుషోత్తమరెడ్డి వర్ధంతి


దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ నాయక్, తదితరులు

పులివెందుల టౌన్ : వైఎస్ కుటుంబంలో దివంగత నేత, మాజీ ఎమ్మెల్యే ఎస్.పురుషోత్తమరెడ్డి ధృవతారలా వెలిగారని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో పురుషోత్తమరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పురుషోత్తమరెడ్డి మనమరాలు కడపకు చెందిన ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ వింధ్య దివ్యాంగులకు విందు భోజనంతోపాటు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ డాక్టర్ ఎస్.పురుషోత్తమరెడ్డి ప్రజా సేవయే కాకుండా ఎంతోమందికి కంటిచూపును ప్రసాదించి అంధ బాంధవుడిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ప్రతినిధులు ఆర్.వెంకటసుబ్బయ్య, శీలం సునీల్ కుమార్, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు


వేంపల్లెలో డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఎర్రగుంట్లలో గురువులను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

వేంపల్లె : ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం, గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య, ఉషాకిరణ్, శ్రీనివాస, లిటిల్ ఫ్లవర్, వికాస్, స్వామి వివేకానంద, తేజ పాఠశాలల్లోనూ, ఆవోపా ఆధ్వర్యంలో ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుమారస్వామి గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు సూచించే బాటలో నడిచి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూజ కార్యక్రమంలో గురువులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, ఓబులయ్య, రామాంజనేయులు, రామసుబ్బారెడ్డిలను సత్కరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి ఘనంగా నివాలర్పించారు.

ఘనంగా మిలాద్ జెండా ఊరేగింపు


బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ షేక్ ఇస్మాయిల్


జమ్మలమడుగులో ర్యాలీలో పావురాలను ఎగురవేస్తున్న పీఠాధిపతి, తదితరులు

కమలాపురం : పీఠాధిపతి శ్రీ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో, దర్గా కన్వీనర్ వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ షేక్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో శనివారం ఆస్థాన–ఏ–జహీరియా నుంచి దర్గా–ఏ–గఫారియా వరకు మిలాద్–ఉన్–నబి జెండా ఊరేగింపు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బాణా సంచా కాల్చుతూ డప్పు వాయి ద్యాలు, మేళ తాళాలతో ఊరేగింపు సాగింది. నారె–ఏ–తక్బీర్.. అల్లాహు అక్బర్, యా పీర్.. యా గౌస్.. అనే నారాలతో, ఖసీదా ఖానాలతో ఊరేగింపు సాగింది. అనంతరం పెద్ద దర్గా ఆవరణలో మి లాద్ జెండాను పీఠాధిపతి ప్రతిష్ఠించారు. అనంత రం స్వాముల వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి, ప్రత్యేక ఫాతెహా చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరిస్వామి, మౌలానాస్వామి, గౌస్‌పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, భక్తులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

జష్న్–ఏ–మీలాద్‌ను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ముస్లిం యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం రాత్రి జరిగిన ఆసారె షరీఫ్ తిలకించడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. శనివారం తెల్లవారు జామున వరకు జరిగిన ఆసారె షరీఫ్‌ను భక్తులు తిలకించి భక్తి పరవశులయ్యారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ప్రపంచానికి మార్గదర్శకం మహమ్మద్ ప్రవక్త బోధనలే అని ఆస్థానయే గౌసియా అధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ తెలిపారు. శుక్రవారం మహమ్మద్ ప్రవక్త 1500 జన్మదిన సందర్భంగా పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ సుబ్బారావు, పీఠాధిపతి సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీలతోకలిసి శాంతి కపోతాలను ఎగురవేశారు. అలాగే ఆస్తానయే జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్‌పాషా ఖాద్రీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆస్తానయేలో స్వామి వారి జ్ఞాపికలు ప్రదర్శనకు ఉంచారు.

రేపు సంపూర్ణ చంద్ర గ్రహణం

పులివెందుల టౌన్ : ఈనెల 7వ తేదీన ఆదివారం సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడుతుందని, దీన్ని రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం అంటారని ప్రముఖ పురోహితులు, పంచాంగ విశ్లేషకులు రామ్‌కుమార్‌శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ చంద్ర గ్రహణం దేశమంతటా కనిపిస్తుందని, ప్రారంభ కాలం ఆదివారం రాత్రి 9.52 గంటల నుంచి మోక్షకాలం అర్ధరాత్రి 1.30 గంటల వరకు ఉంటుందన్నారు. గర్భవతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ గ్రహణం శతభిష నక్షత్రం,. పూర్వాభద్ర నక్షత్ర జాతకులు కుంభ రాశివారు చూడకూడదన్నారు. దేవాలయాలను ఆదివారం సాయంత్రం 6 గంటలకు మూతవేసి మరుసటి రోజు సోమవారం గ్రహణ సంప్రోక్షణాధికాలు ఆచరించి దేవతార్చనలు ఆచరించాలన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

కమలాపురం : ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఉల్లి రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలని లేని పక్షంలో ఉద్యమం తప్పదని సీపీఐ ఏరియా కార్యదర్శి జి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురం నియోజకవర్గంలో వందల హెక్టార్లలో ఉల్లి పంట సాగు చేశారన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతన్నలు అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఉల్లి రైతులకు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలన్నారు. లేని పక్షంలో సీపీఐ తరపున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోండి

వేముల : వర్షాకాలంలో దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య ప్రజలకు సూచించారు. వేముల పీహెచ్‌సీ పరిధిలోని బెస్తవారిపల్లెలో శుక్రవారం ఫ్రై డే – డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తొట్లు, నీటి డ్రమ్ములు, నీరు నిల్వ ఉంచుకునే ఇతర పాత్రలపై మూతలు ఉంచుకోవాలన్నారు. దోమ ఒక్కసారి 100 నుండి 200 గుడ్లు పెడుతుందని, దోమలను లార్వా దశలోనే నివారించుకోవాలన్నారు. దోమలు కుట్టడం ద్వారా మలేరియా, ఫైలేరియా తదితర వ్యాధులు సోకుతాయన్నారు. దోమ కాటుకు గురికాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమేష్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆలయ రిటైర్డు ఈఓ మృతి

పులివెందుల రూరల్ : పట్టణంలోని నివాసముంటున్న ఆలయ రిటైర్డు ఈఓ రాఘవరెడ్డి శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాఘవరెడ్డిని 10 రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని మృతుడి బంధువులు తెలిపారు.

వేంపల్లె : స్థానిక గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 5 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులలు బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే గ్రామపంచాయతీకి ఈఓను నియమించాలన్నారు. జీతాలు రాక కరెంటు బిల్లులు, పాల బిల్లులు, ఇంటి అద్దెలకు నానా అవస్థలు పడుతున్నారన్నారు. చెత్త కుప్పలు దిబ్బలు దిబ్బలుగా పేరుకపోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామాంజనేయులు, సుబ్బరాయుడు, బాలాజి, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి


బిక్షాటన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు పారిశుద్ధ్య సిబ్బంది

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు నిర్వహిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ నిహారిక క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జాతీయ సమావేశాలు జయప్రదం చేయండి

కమలాపురం : కడప నగరంలో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని సీఐటీయూ (ఆటో) మండల కార్యదర్శి రాజేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద వాల్ పోస్టర్లు ఆయన ఆటో యూనియన్ నాయకులతో కలసి విడుదల చేసి మాట్లాడారు. 8న ఉదయం 10 గంటలకు కడప నగరంలోని కొత్త బస్టాండు నుంచి ప్రదర్శన ప్రారంభం అవుతుందని, పాత బస్టాండుకు చేరుకున్న అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

రైతుల సమస్యలను పట్టించుకోండి

జమ్మలమడుగు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు మద్దతుగా ఈనెల 9వ తేదీన జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన నాయకులను, కార్యకర్తలను కోరారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు కలిపి మొత్తం రూ.26 వేలు ఇస్తామని చంద్రబాబునాయుడు ప్రకటించారు. అయితే మొదటి ఏడాది పూరైనా అన్నదాత సుఖీభవ ఇవ్వలేదు. పెద్దముడియం మండలంలో సోలార్ కంపెనీ ప్రతినిధులు రైతుల భూముల్లో వారికి తెలియకుండా గుంతలు తవ్వుతున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, గిరిధర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ధన్నవాడ మహేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి వంగల సుదర్శన్ రెడ్డి, కొమెర్ల మోహన్‌రెడ్డి, గౌస్‌లాజం, ముల్లాజానీ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం


చక్రపాణిరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

వేంపల్లె : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డిని ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఉపాధ్యాయు దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇటాక్), లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నమయ్య, కడప సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురువుల సత్కారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి శ్రీ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డిని సత్కరించి మెమొంటోను అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు


కలెక్టర్ చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు బండి సుధాకర్‌రెడ్డి


కొండాపురం : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందకుంటున్న నాగకృష్ణారెడ్డి


ఎర్రగుంట్ల : కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న సావిత్రమ్మ


సింహాద్రిపురం : కలెక్టర్ చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న పద్మనాభరెడ్డి

పులివెందుల టౌన్ : విద్యార్థులెందరో ప్రస్తుతం విద్యావంతులుగా, మంచి ఉద్యోగాలలో ఉంటున్న వారికి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన బండి సుధాకర్‌రెడ్డి ఆదర్శవంతుడు, పిల్లలు మెచ్చిన గురువుగా పేరొందారు. బండి సుధాకర్‌రెడ్డి తను ఉపాధ్యాయ వృత్తిలో 1984లో ప్రవేశించి నేటికి దాదాపు 42 ఏళ్లు. ఆయన వందలాది మంది విద్యార్థులకు మంచి విద్యాబోధనలతోపాటు నైతిక విలువలు, జీవన నైపుణ్యాలను కూడా నేర్పించారు. ఈయన రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ (ఎస్టీయూ)లో రాష్ట్ర నాయకత్వంలో ఉంటూ నేటి ఉపాధ్యాయులకు సేవలు అందిస్తున్నారు.

పెండ్లిమర్రి..

పెండ్లిమర్రి : విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే రీతిలో వినూత్న బోధన, చిత్రాలతో విద్యాబుద్ధులు నేర్పిస్తూ ప్రత్యేక కృషి చేసినందుకు విద్యారంగలో అందించిన విశిష్ట సేవలకు వైఎస్సార్ కడప జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా పి.సుహాసినిని ఎంపిక చేశారన్నారు. మర్రిమాకులపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఆమె పనిస్తున్నారు.

కొండాపురం..

కొండాపురం : ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు జాబితాలో మండలంలో బెడుదూరు జెడ్పీ ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల భాషా ఉపాధ్యాయుడు పాముగారి నాగకృష్ణారెడ్డి కలెక్టర్ చేతుల మీదగా అవార్డు తీసుకున్నాడు. వెనుక బడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన చేసి వారిని ఉత్తీర్ణత సాదించేందుకు ఆయన కృషి చేశారు.

ఎర్రగుంట్ల..

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న చాంద్‌బాషా, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీడీ మంజులదేవి, చిలంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సావిత్రమ్మలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డుకు ఎంపికయ్యారు. వీరు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

సింహాద్రిపురం..

సింహాద్రిపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పీవీ పద్మనాభరెడ్డికి ఉపాధ్యాయ అవార్డు వరించింది.